

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## వాలి

**సంరంభం ముగిసింది.** పనీపాటా ఏమీ లేకపోయినా చుట్టాలంతా భోజనాలు చేసి అలిసిపోయినట్లుగా దొరికిన ప్రదేశాల్లో జారగిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

తాంబూలాలు పుచ్చుకోవటం ముగించిన అమ్మాయి తల్లితండ్రులు హైరానాపడుతూ మగపెళ్ళివారికి మర్యాదలు చేస్తున్నారు.

అందరి భోజనాలు ముగిసాక ఊళ్ళోని అతిధులు ఇళ్ళకి వెళ్ళిపోయారు. ఊళ్ళనుంచి వచ్చినవాళ్ళు హైదరాబాదులోని తమ బంధుమిత్రుల ఇళ్ళకి వెళ్ళారు. అబ్బాయి అమ్మా నాన్న చార్మినార్‌లో షాపింగ్ కోసం వెళితే, పెళ్ళికొడుకు ఒక్కడే మిగిలిపోయాడు.

"పైన గదిలో అబ్బాయి ఒక్కడే ఉన్నాడు. వెళ్ళి కాసేపు కబుర్లు చెప్పిరారాదు?" అమ్మాయి మేనత్త చనువుగా చెప్పింది.

పట్టుచీర విప్పి లంగా ఓణీలోకి మారిన పెళ్ళికూతురు బుగ్గలు ఎర్రబడ్డాయి. తల్లివైపు చూసింది.

"పర్లేదు. వెళ్ళు." ఆవిడ నవ్వింది.

సిగ్గుపడుతూ మెట్లెక్కింది. మొహమాటంగా ఉన్నా ఆమెకి చాలా ఇష్టంగా ఉంది. ఎంగేజ్‌మెంటు సమయంలోని చిరుచిరు స్పర్శలు ఆమెని గిలిగింతలు పెడుతున్నాయి.

నెమ్మదిగా తలుపు తట్టి, దగ్గరకి వేసి ఉన్న దాన్ని మెల్లగా తెరచుకుని లోపలికి అడుగు పెట్టింది.

టేబుల్ ముందు నిలబడి, దాని మీదున్న ఆమె పుస్తకాలని పరిశీలిస్తున్న అబ్బాయి వెనక్కి తిరిగి ఆమెని చూసి చిరునవ్వు నవ్వాడు. ధైర్యం వచ్చిన ఆమె ఇంకో రెండడుగులు లోపలికి వేసింది.

"హాయ్! ఇది నీ రూమ్ కదూ?" అడిగాడు.

అవునన్నట్లుగా తలాడించింది.

"రా. కూర్చో" మంచం మీద కూర్చుని పక్కన కూర్చోమన్నట్లుగా చేత్తో తట్టాడు.

ఆమె బిడియపడుతూ టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చుంది. అతను కొద్దిగా నిరాశపడ్డాడు. అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లుగా అడిగాడు.

"అవును మీ అక్కకెందుకు తను లాయర్ అని అంత పొగరు?"

ఆమె తృళ్ళిపడింది. తినే పాయసంలో ఈగ పడినట్టుగా అనిపించింది.

"ఎందుకలా అంటున్నారు? మా అక్క గురించి మీకేం తెలుసు?" ఆమె కంఠం సన్నగా ఒణికింది.

"ఇందాక డైనింగ్ టేబుల్ దగ్గర మగాళ్ళతో ఎగబడి ఏం మాట్లాడేస్తోందో! మీ నాన్నేమో కూతురి ప్రతిభకి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు. మీ బావేమో ఓ చవట దద్దమ్మ."

అతని భాషకి ఆమె నివ్వెరపోయింది.

"అప్పుడు బయటివాళ్ళెవరూ లేరుగా? మనమేకదా?"

"ఐతే మాత్రం ఎగబడి మాట్లాడాలా? అవునూ మీ బావ అంత నల్లగా చింతపండులా ఉన్నాడు కదా మీ అక్క ఎలా చేసుకుంది?" ఆరాగా అడిగాడు.

"బావ బంగారంలాంటివాడు. అక్క బావని ప్రేమించి పెళ్ళిచేసుకుంది..."

"వాట్?! లవ్ మేరేజా? మరి మాకెందుకు చెప్పలేదు? ఇలాంటి సంకర కులం వాళ్ళింటి పిల్లని చేసుకుంటున్నానని తెలిస్తే మా అమ్మా నాన్న అస్సలు ఊరుకోరు. ఈ మధ్యవర్తి బుద్ధేమైంది?" అరిచాడు.

ఆ ఇరవై ఎనిమిదేళ్ళ వృద్ధుడ్ని ఆమె జాలిగా చూసి చెప్పింది.

"బావది మన కులమే. మా నాన్నకి దూరపు బంధువు. అక్క ఆయన దగ్గరే జూనియర్‌గా చేరింది."

"ఓ! అట్లా చెప్పు. జూనియర్‌గా చేరి పటాయించిందన్నమాట!" అవసరం లేకపోయినా పెద్దగా నవ్వాడు.

ఆ భాషకి మళ్ళీ విస్తుపోయింది అమ్మాయి.

"ఎంగేజ్‌మెంట్ అంటే సగం పెళ్ళయిపోయినట్లే. అలా దూరంగా కూర్చుంటావే? రా ఇక్కడ కూర్చో" అవసరం లేకపోయినా జరిగాడు.

అమ్మాయి ఓ క్షణం తటపటాయించి, లేచి అతని పక్కన కూర్చుంది. అతను ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

అమ్మాయికి పొద్దున కలిగిన పులకింతలు కలగలేదు. మౌనంగా ఉండిపోయింది.

"నీ వేళ్ళు కొంచెం లావుగా ఉన్నాయి. మీ అక్క వేళ్ళు పెసరకాయల్లా ఎంత సన్నగా ఉన్నాయో!" ఆమె వేళ్ళు రాస్తూ అన్నాడు. ఆమె చటుక్కున చేతిని లాక్కుంది.

అతని చెయ్యి ఆమె నడుం మీద పడింది.

"నువ్వు మీ నాన్న పోలిక. మీ అక్క మీ అమ్మలా నాజూగ్గా ఉంది. నడుం ఉందా లేదా అన్నట్లుగా. కాకి వెధవ - లక్కీ ఫెలో" నిట్టూర్చాడు.

అమ్మాయి  లేచి నుంచుంది.

"వెళ్తాను" పొడిగా చెప్పింది.

"అప్పుడేనా? మా అమ్మా వాళ్ళు వచ్చేదాకా ఉండు.. అవును మీ అక్క.."

"ఏమంది వెళ్తాను." అమ్మాయి విసురుగా వెళ్ళిపోయింది.

రైలు సమయానికి రెండు గంటల ముందు బండెడు వస్తువులతో వచ్చిన అబ్బాయి తల్లితండ్రులకి అమ్మాయి అక్కయ్య తన కుసుమ కోమలమైన చేతులతో ఓ నోటీస్‌ని అందించింది.

అబ్బాయి మానసిక ఆరోగ్యం బాగాలేదని ఆలస్యంగా గమనించడం వల్ల పెళ్ళి కాన్సిల్ చేస్తున్నామని, నిశ్చితార్థానికైన ఖర్చులో సగం చెల్లించి బయటికి నడవమని అందులో ఉంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story